





కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

# వైద్యహబ్‌గా అందోలు-జోగిపేట

- అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసే బాధ్యత నాది
- అజ్జమర్రి-జోగిపేట మధ్య రూ.80 కోట్లతో బ్రిడ్జి
- సంగుపేట నుంచి అన్నాసాగర్ వరకు రోడ్డు విస్తరణ
- అందోలు వద్ద నర్సింగ్ కళాశాల, 150 పడకల ఆసుపత్రి
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

జోగిపేట, ఫిబ్రవరి 17: నియోజకవర్గ కేంద్రమైన అందోలు-జోగిపేట జంట పట్టణాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. నియోజకవర్గ కేంద్రంలో శనివారం మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందోలు-జోగిపేట మున్సిపాలిటీని అన్నిరంగాల్లోనూ అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా అందోలు-జోగిపేటను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దానని, ఇప్పుడు వైద్యశాఖ మంత్రిగా వైద్య హబ్‌గా అభివృద్ధి చేస్తానని తెలిపారు. జోగిపేటలోని ఏరియా ఆసుపత్రిని ఆధునీకీకరిస్తానని, ఖాళీగా ఉన్న పోస్టులను ఇప్పటికే భర్తీ చేస్తున్నామని చెప్పారు. అందోలు-జోగిపేట పట్టణం విస్తరించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం అందోలు శివార్లలో నర్సింగ్ కళాశాలను, అనుబంధంగా 150 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. జోగిపేటకు వ్యాపారపరంగా కనెక్టివిటీ కోసం అజ్జమర్రి వద్ద మంజీరా నదిపై రూ.80 కోట్లతో కొత్తగా బ్రిడ్జిని నిర్మిస్తామని, దీంతో 25 గ్రామాలకు జోగిపేటతో రవాణా సౌకర్యాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు. చారిత్రాత్మకమైన అందోలు రంగనాయకసాగర్ చెరువు కట్టను సుందరీకరించి, బోటింగ్ సౌకర్యాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. సంగుపేట నుంచి జోగిపేట, నేరేడి గుంట నుంచి జోగిపేట రోడ్లను విస్తరిస్తామని తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ఎస్.సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, రేఖాప్రవీణ్, దాకూరి శంకర్, హరికృష్ణాగౌడ్, రంగ సురేష్, నాయకులు దాకూరి వెంకటేశం, ప్రదీప్‌గౌడ్, శివకుమార్, గొల్ల శరత్ భాస్కర్, రాజశేఖర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

### సమాజాభివృద్ధికి తోడ్పడాలి

సంగారెడ్డి రూరల్: సమాజాభివృద్ధికి పారిశ్రామికవేత్తలు తోడ్పాటునందించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో శనివారం పారిశ్రామికవేత్తలు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమల యాజమాన్యాలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు జిల్లా అభివృద్ధికి వినియోగించాలని కోరారు. విద్యా, వైద్య సదుపాయాల కల్పనకు, విద్యాసంస్థలు, ఆసుపత్రుల్లో సదుపాయాల కల్పన కోసం ఖర్చు చేయాలని సూచించారు. జిల్లాలోని ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద ఇవ్వాల్సిన నిధులతో గుర్తించిన పనులను చేయాలని, జిల్లా యంత్రాంగం సహకరించాలని సూచించారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో పరిశ్రమలు ఉన్న ప్రాంతాలకు, జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చేలా క్లస్టర్ ఇన్‌చార్జి అధికారులు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



అందోలులో శిథిలావస్థలో ఉన్న ఐబీ బంగ్లాను పరిశీలిస్తున్న మంత్రి

# అక్కడ దించేస్తే.. ఇక్కడ ఎక్కేస్తాం!





గుమ్మడిదల ఎంపీపీ కార్యాలయం

- జిన్నారం రాజకీయం.. గుమ్మడిదలపై ప్రభావం
- ఎంపీపీ పీఠానికి పొంచిఉన్న ప్రమాదం
- అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్ ఎంపీటీసీలు సన్నద్ధం

గుమ్మడిదల, ఫిబ్రవరి 17: గుమ్మడిదల మండలంలో రాజకీయం రసకందాయంలో పడింది. రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో మండలంలోనూ రాజకీయాలు మారిపోయాయి. పటాన్‌చెరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి గెలిచినా.. మండలంలో మెజార్టీ రాకపోవడంతో ఆయన స్థానిక రాజకీయాలను, నాయకులను పట్టించుకోవడం లేదని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో జిన్నారం మండల ఎంపీపీ(కాంగ్రెస్)పై బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టడంతో ఆ ప్రభావం గుమ్మడిదల మండలంపై చూపే అవకాశం కనిపిస్తున్నది. గుమ్మడిదల మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. గత ఎన్నికల్లో 7 స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుని ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకుంది. కాంగ్రెస్ మూడు స్థానాలకే పరిమితమైంది. కానీ ఇటీవల రాష్ట్రంలో అధికారం మారడంతో బీఆర్ఎస్ సభ్యులు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. అన్నారం ఎంపీటీసీ బేగర్ లక్ష్మి, గుమ్మడిదల ఎంపీటీసీ రాజ్యలక్ష్మి ఇటీవల బీఆర్ఎస్‌కు రాజీనామాచేసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ప్రస్తుతం మండల పరిషత్‌లో ఇరు పార్టీ బలాబలాలు సమానమయ్యాయి. బీఆర్ఎస్ నుంచి మరో ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం నేపథ్యంలో ఎంపీపీపై అవిశ్వాసానికి కాంగ్రెస్ సభ్యులు సిద్ధమవుతున్నారు. ఐదు నెలల పదవీ కాలం మాత్రమే ఉండడంతో ఇప్పుడు అవిశ్వాసం అవసరమా అంటే.. జిన్నారంలో బీఆర్ఎస్ నాయకులు పెట్టగా లేనిది తామెందుకు పెట్టకూడదని వారు సమాధానమిస్తున్నారు. మరోవైపు స్థానిక రాజకీయలను సీరియస్‌గా తీసుకోవాలని కాంగ్రెస్ అధిష్ఠానం గుమ్మడిదల, జిన్నారం మండల నాయకులను ఆదేశించినట్టు తెలిసింది. జిన్నారంలో ఎంపీపీపై అవిశ్వాసంలో బీఆర్ఎస్ విజయం సాధిస్తే.. గుమ్మడిదలలో బీఆర్ఎస్ ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని నియోజకవర్గ నాయకులకు నిర్దేశించినట్టు కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలోని కీలక నేత ఇంట్లో దీనిపై చర్చలు జరిపినట్లు తెలిసింది. ఈ నెల 26న జిన్నారంలో జరిగే అవిశ్వాస తీర్మానం ఫలితం ఆధారంగా గుమ్మడిదల మండలంలోనూ రాజకీయాలు మరే అవకాశం కనిపిస్తున్నది.

# అవిశ్వాస సమావేశం కోసం ఎదురుచూపులు

### చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి 20 మంది సంతకాలు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 17: సంగారెడ్డి గ్రేడ్‌వన్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సమావేశం ఏర్పాటు కోసం కౌన్సిలర్లు ఎదురు చూస్తున్నారు. ఈమేరకు పలువురు కౌన్సిలర్లు శనివారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలువగా త్వరలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన చెపినట్టు తెలిసింది. అవిశ్వాస తీర్మానం నోటీసుపై తొలుత 17 మంది కౌన్సిలర్లు సంతకాలు చేయగా తాజాగా మరో ముగ్గురు కౌన్సిలర్లు కూడా సంతకాలు చేసినట్టు తెలిసింది. మొదటి నోటీసులో సంతకాలు చేసిన ముగ్గురు కౌన్సిలర్లు తాము వెనక్కి తగ్గుతున్నట్టు మున్సిపల్ కమిషనర్‌కు లేఖను అందజేయగా, ఆ లేఖ చెల్లుబాటు కాదని కమిషనర్ తెలిపారు. మొదట్లో అవిశ్వాస నోటీసుపై సంతకాలు చేసిన కౌన్సిలర్లు షేక్‌సాబేర్, వెంకటరాజ్, మాధురి తాము తప్పుకుంటున్నట్టు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు లేఖలు అందజేసిన విషయం తెలిసిందే. అయితే అవిశ్వాస నోటీసుపై చేసిన కౌన్సిలర్ల సంతకాలను 2019లో గెలిచి ప్రమాణ స్వీకార సమయంలో రిజిష్టర్‌లో చేసిన సంతకాలను మున్సిపల్ అధికారులు పోల్చి చూడగా సరిగ్గానే ఉన్నాయని నిర్ధారించినట్టు తెలిసింది. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవిపై అదే పార్టీకి చెందిన వైస్ చైర్‌పర్సన్ శంకరి లతా విజయేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్ రేసులో ఉన్న నక్క మంజులతా నాగరాజుగౌడ్‌తో పాటు మొత్తం 20మంది కౌన్సిలర్లు సంతకాలు చేశారు.అవిశ్వాసం నెగ్గాలంటే 26 మంది కౌన్సిలర్ల మద్దతు అవసం కాగా మిగిలిన కౌన్సిలర్ల సాయం కోసం మంజులతా నాగరాజుగౌడ్ ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

# ఏడుపాయల జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్

పాపన్నపేట, ఫిబ్రవరి 17: ఏడుపాయల క్షేత్రంలో మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తామని దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జాతర ఏర్పాట్లపై సిబ్బందికి దిశానిర్దేశం చేయడానికి శనివారం ఏడుపాయల ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. భక్తులకు బస, తాగునీరు, తాత్కాలిక శౌచాలయాలు, పార్కింగ్, క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం రాజగోపురం వరకు బ్యాటరీ ఆటోలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ నెల చివరి వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆయనవెంట ఈఈ మల్లికార్జున్, ఆర్డీవో రాజేశ్వర్, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, ధర్మకర్తలు వెంకటేశం, మనోహర్, మోహన్‌రావు, ఆలయ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సూర్యశ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అంతకుముందు పనిచేయని సిబ్బందిపై కమిషనర్‌కు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆలయంలో శాశ్వత సిబ్బంది ఉన్నప్పటికీ ఒప్పంద కార్మికులతోనే పనులు చేయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దాతలు కట్టించిన ఒక్క కాటేజీ కూడా సక్రమంగా లేదని ఆరోపించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఈవోపై ఉన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరారు.



ఆలయ చైర్మన్, ఉద్యోగులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

## అవినీతికి కేరాఫ్.. ఆర్టీఏ ఆఫీస్

### రవాణా కార్యాలయంలో దళారుల దందా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 17 : సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. దళారులు అందినకాడికి దోచుకుని వాహనదారులను పీడిస్తున్నారు. అధికారుల జేబులు నింపుతున్న ఈ బ్రోకర్ల సహాయంతో వెళితేనే పనులు జరుగుతున్నాయని వాహనదారుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రవాణా శాఖ కార్యాలయంలో ఏ పనికైనా ప్రభుత్వ నిబంధనల ప్రకారం మీసేవలో ఆన్‌లైన్ ఫీజు కట్టి, సంబంధిత పత్రాలు తీసుకొని ఆర్టీవో ఆఫీస్‌కి వెళ్తే పని అయిపోతుంది. ఈ విషయం తెలిసినవాళ్లు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి నేరుగా ఆఫీస్‌కి వెళ్లినా అక్కడ ఉన్న కొంతమంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఏదో ఒక కొర్రీ పెట్టి పని చేయడం లేదు. దళారులను ఆశ్రయిస్తే పని సులభంగా పూర్తవుతున్నదని వినియోగదారులు చెబుతున్నారు. ఆర్టీవో కార్యాలయం చుట్టుపక్కల సుమారు 20 వరకు బ్రోకర్ల షాపులే దర్శనమిస్తాయి. ఏ పనికైనా బ్రోకర్ల దగ్గరికి వెళ్తే వారే ఆన్‌లైన్‌లో ఫీజు కట్టి సంబంధిత పత్రాలు సెట్ చేసి ఆఫీస్‌కి వెళ్లి ఫొటో తీయించి, సంతకం చేయించడంతో పాటు పని పూర్తయ్యేంత వరకు వారే చూసుకుంటారు. ప్యాకేజీలు మాట్లాడుకుని లేని పత్రాలను క్రియేట్ చేసి మరీ పని పూర్తి చేయిస్తున్నారు. బ్రోకర్లు వసూలు చేసిన మొత్తంలో అధికారులకు, సిబ్బందికి వాటాలు చెల్లించడంతోనే వారు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఉన్న రవాణాశాఖ అధికారి అవినీతి ఆరోపణలతో హైదరాబాద్‌కు బదిలీ కాగా అనంతరం సస్పెండ్ కూడా అయ్యారు. ఇటీవల రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో అన్నిశాఖల్లో బదిలీలు చేపట్టగా రవాణా శాఖలోనూ కొనసాగుతున్నాయి. సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారితో పాటు ఇతర అధికారులు, సిబ్బంది అందరూ బదిలీ అయ్యారు. కొత్త అధికారులు రావడంతోనైనా పరిస్థితిలో మార్పు వస్తుందా చూడాలి.



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షిషా

## సీసీ కెమెరాల నిఘాలో

# ఇంటర్మీడియట్ పరీక్షలు

- ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహణ
- మెదక్ జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 13,173 మంది విద్యార్థులు
- సమీక్షలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో శనివారం ఆయన అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు జరుగనున్న ఇంటర్ పరీక్షల కోసం జిల్లావ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 13,173 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ప్రశ్నపత్రాల స్టోరేజికి 14 పాయింట్లు ఏర్పాటు చేశామని, 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 30 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందం, 4 సిట్టింగ్ స్క్వాడ్, 5 కస్టోడియన్ బృందాలు, 600 మంది ఇన్విజిలేటర్స్‌ను నియమించామని తెలియజేశారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీకెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పరీక్షా సమయంలో సెంటర్ల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని సంబంధిత శాఖల అధికారులను నిర్దేశించారు. సమావేశంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి సత్యనారాయణ, డీఈవో రాధాకిషన్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లు

## 'డబుల్' ఇళ్ల పంపిణీ ఇంకెప్పుడు?

- నర్సాపూర్‌కు 500 ఇళ్ల మంజూరు
- 252 ఇళ్ల నిర్మాణం పూర్తి
- వేల సంఖ్యలో దరఖాస్తులు
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదలు


8లో




# కొలువుదీరేదెన్నడు?

- మల్లన్న ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠాపనపై నిర్లక్ష్యం
- గదికే పరిమితమైన భద్రకాళి, వీరభద్రుడు, విజయగణపతి విగ్రహాలు

చేర్యాల, ఫిబ్రవరి 17 : కొమురవెల్లి మల్లన్న ఆలయవర్గాల పట్టింపులేనితనంతో భద్రకాళి, వీరభద్రుడు, విజయగణపతి దేతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనకు నోచుకోవడంలేదు. రెండేళ్ల క్రితమే ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేపట్టినప్పటికీ ఆలయవర్గాల మధ్య నెలకొన్న విబేధాలతో అర్ధాంతరంగా నిలిచిపోయింది. ప్రతీ ఏటా మూడు నెలలపాటు కొనసాగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా అగ్నిగుండాలు నిర్వహిస్తారు. అందుకు సూచకంగా వీరభద్రుడు, భద్రకాళి అమ్మవారి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. గతంలో రాజగోపుర ఆవరణలో నిర్వహించినా కొన్నేళ్లుగా తోటబావి ప్రాంగణంలోని కల్యాణవేదిక వద్ద నిర్వహిస్తున్నారు. ఆయా దేవతామూర్తుల విగ్రహాలను శాశ్వతంగా నెలకొల్పాలని నిర్ణయించి ఆలయ తోటబావి ప్రాంగణంలో మండపాలను నిర్మించారు. అలాగే, వాస్తురీత్యా అనుకూలత కోసం నైరుతి దిశ రాజగోపుర ఆవరణలో విజయ గణపతి మండపాన్ని నిర్మించారు. దేవతామూర్తుల విగ్రహలను తీసుకువచ్చి ప్రతిష్ఠాపనకు చర్యలు తీసుకున్నారు. ఏడాదిన్నర క్రితం పాలక మండలి సమీక్షా సమావేశంలో తీర్మానం చేసి 2022, మే 12 నుంచి 14 వరకు విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కానీ ఇదేవిషయంలో ఆలయవర్గాల మధ్య విబేధాలు, భిన్నాభిప్రాయాలు తలెత్తడంతో అర్ధాంతరంగా వాయిదా పడింది. అప్పటి నుంచి ఆయా దేవతామూర్తుల విగ్రహాలు ఆలయంలోని ఓ గదిలోనే భద్రపరిచి ఉన్నాయి. తద్వారా వాస్తుపరంగా, పాలనపరంగా దోషం నెలకొనడంతోనే ఆలయ నిర్వహణలో అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్న ప్రచారం సాగుతుంది. ప్రస్తుత సంవత్సర జాతర కొనసాగుతుండటంతో పాటు ఏప్రిల్ 7వతేదీన తోటబావి ప్రాంగణంలో అగ్నిగుండాలకు వీరభద్ర పల్లెరం, భద్రకాళి పూజ చేపట్టనున్నందున ఆయా దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన చేయాలని భక్తులు కోరుతున్నారు.

### త్వరలో నిర్ణయం తీసుకుంటాం

గతంలో ప్రతిష్ఠాపనకు చర్యలు తీసుకున్నప్పటికీ అనివార్య కారణాలతో నిలిచిపోయింది. కమిషనర్‌తో పాటు పునరుద్ధరణ కమిటీతో చర్చించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం. త్వరితగతిన ప్రతిష్ఠాపన చేసేలా చర్యలు తీసుకుంటాం.

-బాలాజీశర్మ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

# సుడా మెగా లేఅవుట్.. అట్టర్‌ఫ్లాప్

### ప్లాట్లకు దక్కని డిమాండ్.. రెండుసార్లు వేలం నిర్వహించినా ఆసక్తి కరువు

### 161కు ప్లాట్లకు కేవలం 9 మాత్రమే రిజిస్ట్రేషన్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 16 : గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేటలో ప్రతిష్ఠాత్మకంగా సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా లేఅవుట్ పరిస్థితి అయోమయంగా మారింది. ఇప్పటివరకు సిద్దిపేట జిల్లా కేంద్రంలో సుడా లేఅవుట్‌పై రెండుసార్లు వేలం నిర్వహించినప్పటికీ ప్లాట్లను కొనడానికి ఎవరు అంతగా ఆసక్తి కనబరచలేదు.

### 14 ఎకరాల్లో మెగా లేఅవుట్

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి శివారులో సుమారు 14 ఎకరాల అసైన్డ్ భూములను అధికారులు సేకరించి సుడా ఆధ్వర్యంలో మెగా వెంచర్‌కు ప్రణాళిక రూపొందించారు. ఈ లేఅవుట్‌లో సుమారు రూ.6 కోట్లతో మౌలిక వసతులను కల్పనకు పూనుకున్నారు. విశాలమైన రోడ్లు, పార్కు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. అవి కూడా 50 శాతం వరకు పూర్తయ్యాయి. అక్కడున్న ధర కంటే అధిక ధర కారణమా.. లేకుంటే సిద్దిపేట పట్టణానికి కాస్త దూరంలో ఉంటుందనో.. తెలియదు కానీ వేలంలో పాల్గొనడానికి మాత్రం చాలా మంది సుముఖత చూపలేదు. 161 ప్లాట్లు చేయగా అందులో 60 ప్లాట్లను స్థలం ఇచ్చిన అసైన్డ్‌దారులకు కేటాయించారు. మిగిలిన ప్లాట్లను వేలం నిర్వహించగా 21 మాత్రమే అమ్ముడుపోయాయి. ఇందులో తొమ్మిది మాత్రమే పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ జరిగాయి. ఎనిమిది మంది పావులా వంతు మాత్రమే డబ్బు చెల్లించగా, నలుగురు రూ.5,000 మాత్రమే చెల్లించినట్లు సమాచారం.

### ప్రభుత్వం మారడంతో గందరగోళం

అనుకున్నస్థాయిలో సుడా వెంచర్‌కు డిమాండ్ లేకపోగా ఈ తరుణంలోనే రాష్ట్రంలో ప్రభుత్వ మారడంతో లేఅవుట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుడా చైర్మన్, వైస్ చైర్మన్ వెళ్లిపోయారు. ఇప్పటివరకు కొత్తవారిని నియమించకపోవడంతో భవిష్యత్తులో సుడా మెగా వెంచర్ పరిస్థితి ఏమిటనేది తెలియడం లేదు. ప్రభుత్వం సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని కొనసాగిస్తుందా లేక రద్దు చేస్తుందా అనేది ప్రస్తుతానికి బేతాళ ప్రశ్నగా మిగిలింది.



### డబ్బు కట్టని వారికి నోటీసులు

సుడా వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేసి పూర్తిస్థాయిలో డబ్బు చెల్లించని వారికి త్వరలోనే నోటీసులను పంపిస్తాం. గతంలో ఎన్నికల కోడ్ ఉండడంతో వేలాన్ని నిర్వహించలేకపోయాం. మరోసారి ఓపెన్ ఆక్షన్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- వందనం, సుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్

## 'సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలి'

కంగ్టి, ఫిబ్రవరి 17: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో అవసరమైన పనుల కోసం క్షేత్ర స్థాయిలో అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని ఎంపీడీవో సత్తయ్య సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, జీపీ ప్రత్యేకాధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రతీ జీపీలో కనీసం వందమంది ఉపాధి కూలీలు పని చేసేలా చూడాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పెంచడానికి పాలిథిన్ కవర్‌లలో మట్టిని నింపే పనులు చేయించాలని సూచించారు.

## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

శివ్వంపేట, ఫిబ్రవరి 17: గిరిజనల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినందుకు, శనివారం శివ్వంపేటలో గిరిజనుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కమలపూల్‌సింగ్, నాయకులు నవీన్‌గుప్తా, తిరుపతిరాథోడ్, గేమ్‌సింగ్, రాజు, పాండ్య, శ్రీను, తాలసింగ్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానవాటికలో హైమాస్ట్ లైట్ల ప్రారంభం

టేక్మాల్, ఫిబ్రవరి 17: ఎంపీ నిధులతో మంజూరైన రెండు హైమాస్ట్ లైట్లను టేక్మాల్ దర్గా పీఠాధిపతి హజ్రాత్ సయ్యద్ అహ్మద్ నూరుల్లా హుసేని ఖాద్రి ప్రారంభించారు. ముస్లింల శ్మశానవాటికలో లైట్లు లేవని తెలుసుకున్న ఎంపీ బీబీ పాటిల్ తన నిధులతో లైట్లను మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటి ప్రధాన కార్యదర్శి ఎండబ్ల్యూఎస్ అధ్యక్షులు ఎంఏ సలీమ్, టేక్మాల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షులు వీరప్ప పాల్గొన్నారు.

## కన్నడ సాంస్కృతిక నాయకుడు బసవేశ్వరుడు

● బాల్కి పీఠాధిపతి గురుబసవ పట్టదేవర

కంగ్టి, ఫిబ్రవరి 17: సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపడానికి విశ్వగురువు బసవేశ్వరుడు చేసిన కృషిని కర్ణాటక ప్రభుత్వం గుర్తించిందని, తాజాగా బసవేశ్వరుడిపేరిట కన్నడ సాంస్కృతిక నాయక అనే అవార్డును రూపకల్పన చేసిందని బాల్కి పీఠాధిపతి గురుబసవ పట్టదేవర పేర్కొన్నారు. శనివారం కంగ్టి బసవ మండపంలో బసవేశ్వరుడి చిత్రపటానికి ఆయన పూలమాలలు వేశారు. కర్ణాటకలోని ప్రభుత్వ కార్యాలయంలో బసవేశ్వరుడి చిత్రపటం ఉండేలా చూడాలని, అక్కడి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సంగప్ప, సిద్దుపాటిల్, రాజుపాటిల్, సంతోష్, నాగన్న, విఠల్‌రెడ్డి, విజయ్, బాబు, సతీష్, బండెప్ప, కార్యదర్శి సుభాష్, సంగయ్యస్వామి, తదితరులు పాల్గొన్నారు.

### జహీరాబాద్‌లో..

జహీరాబాద్, ఫిబ్రవరి 17: విశ్వగురు బసవేశ్వరుని చిత్రపటాన్ని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని లింగాయత్ సమాజ్ నాయకులు పేర్కొన్నారు. కర్ణాటక ప్రభుత్వం విశ్వగురు బసవేశ్వరున్ని సాంస్కృతిక నాయకునిగా గుర్తించడంతో శనివారం జహీరాబాద్ పట్టణంలో లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో బసవేశ్వరుడి విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వా వారు మాట్లాడుతూ బసవేశ్వరుడు అందరివాడని, మహిళలకు, అన్నివర్గాల అభ్యున్నతికి కృషిచేసిన గొప్పమహానీయుడన్నారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ అధ్యక్షుడు రాజశేఖర్‌షెట్కార్, కార్యదర్శి రేకుళగి సుభాష్, మడుపతి బస్వరాజ్, మంజులకౌలస్, వియనపాటీల్, నాగన్న, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు

# రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

## రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

## గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

# సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

## వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.





ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

## కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

## ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్ రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

# సమర్థ నాయకత్వానికి చిరునామా కేసీఆర్

● ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు జీవించాలి

● ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి




గజ్వేల్ పట్టణంలోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 17: సమర్థ నాయకత్వానికి చిరునామా కేసీఆర్ అని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా గజ్వేల్ పట్టణంలోని నల్లవాగు గడ్డ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టణంలోని సమీకృత వ్యవసాయ మార్కెట్‌లో కేక్‌ను కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పోరాటాల గడ్డపై ఉద్యమించిన రైతు బాంధవుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించారని, రాష్ట్రంలో వెలుగులు నింపి రైతుల కరెంటు కష్టాలను దూరం చేశారన్నారు. పరిపాలన దక్షుడని, ప్రజల గుండెల్లో తానై నిలిచిన మహనేత అని కొనియాడారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. గజ్వేల్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టుల నిర్మాణం చేసి హల్దీవాగు, కూడవెల్లి వాగులను జీవనదులగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. అంతకుముందు గజ్వేల్ ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీటీసీలతో కలిసి ఎంపీపీ అమరావతి మొక్కను నాటారు. వారితో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ పంగ మల్లేశం, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి రాజమౌళి, డీసీఎంఎస్ డైరెక్టర్ జేజేల వెంకటేష్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు బెండే మధు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సమగ్ర దర్యాప్తుతో కేసుల పరిష్కారం

● నెలవారీ సమీక్షలో మెదక్ ఎస్పీ డా.బాలస్వామి



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ డా.బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17: సమగ్ర దర్యాప్తుతో కేసులు పరిష్కారమవుతాయని, కేసుల నమోదు మొదలు న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని పరిశీలించాలని మెదక్ ఎస్పీ డా.బాలస్వామి పోలీస్ అధికారులకు ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సిబ్బందితో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, వారితో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి, త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు, జిల్లాలోని సీఐ, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు సంఘటితంగా ఉండాలి

● ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమల్లో భాగస్వామ్యం కావాలి

● టీఎన్జీవో తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

● డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మెదక్ కలెక్టర్ రాజర్షిషా





స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17: ఉద్యోగులు సంఘటితంగా ఉన్నప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని మెదక్ కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శనివారం టీఎన్జీవో భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అధ్యక్షతన నిర్వహించిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్నివర్గాల ఉద్యోగులు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఉద్యోగుల చేయూతతోనే జిల్లా వివిధ రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నదని చెప్పారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం నమోదులో రాష్ట్రంలో మెదక్ జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. అందుకు ఉద్యోగుల పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. కొత్త సర్కార్ నిర్వహించిన ప్రజాపాలనలో ఉద్యోగుల కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో ఉద్యోగులు భాగస్వామ్యం కావాలని తెలిపారు. టీఎన్జీవో తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం టీఎన్జీవో మెదక్ జిల్లా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దేవిప్రసాద్, టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి దొంత నరేందర్, రాజ్‌కుమార్, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనురాధ, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌రావు, సీపీఎస్ స్వరూప, ఏటీసీడబ్ల్యూవో నాగరాజ్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షుడు ఇక్బాల్‌పాషా, కోశాధికారి చంద్రశేఖర్, జీపీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు నగేష్ పాల్గొన్నారు.

## 'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

హవేళిఘణపూర్, ఫిబ్రవరి 17: పదో తరగతిలో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తల్లిదండ్రులు ఇంటివద్ద చదివించాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ప్రతిరోజూ పంపించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు, సిలబస్, విద్యార్థుల స్థాయిని తెలుసుకున్నారు. ఆ తర్వాత ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్, తహసీల్దార్ నారాయణ, కరుణాకర్, మండల విద్యాధికారి నీలకంఠం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుమ్మడిదలకు ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ కింద రూ.2.50 కోట్లు

● గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

● పోటాపోటీగా సీసీరోడ్లకు శంకుస్థాపన

● కానుకుంటలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



గుమ్మడిదలలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 17: గుమ్మడిదల మండలానికి కేంద్ర ప్రభుత్వం ఎంజీఎన్‌ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.2.50 కోట్లు మంజూరు చేసింది. దీంతో గుమ్మడిదల మండలంలోని 13 గ్రామపంచాయతీల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రజాప్రతినిధులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం గుమ్మడిదల, బొంతపల్లి, అన్నారం, దోమడుగు, వీరన్నగూడెం, కొత్తపల్లి, నల్లవల్లి, మంబాపూర్, అనంతారం, కానుకుంట, రామిరెడ్డి బావి, వీరేడిపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ కుమార్‌గౌడ్ హాజరుకాగా.. తమ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయని బీఆర్ఎస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులూ సీసీరోడ్ల శంకుస్థాపనలో పాల్గొన్నారు. అన్ని గ్రామాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించగా.. కాంగ్రెస్ నాయకులు సైతం కొబ్బరికాయలు కొట్టి పనులకు శంకుస్థాపనలు చేశారు. కానుకుంట గ్రామంలో ముందుగా బీఆర్ఎస్ నాయకులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించగా.. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ, జడ్పీటీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ నాయకులు రాకముందే కొబ్బరికాయ ఎలా కొడతావంటూ జడ్పీటీసీ కుమార్‌గౌడ్‌పై మండిపడ్డారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. పలువురు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షురాలు మంజులా వెంకటేష్‌గౌడ్, పీఏసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పుట్ట నర్సింగ్‌రావు, ఎండీ హుస్సేన్, మండల నాయకులు, తాజా, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్‌లో అగ్ని ప్రమాదం

● ఆవు మృతి, మరో పదింటికి గాయాలు

● 1500 మోపుల ఎండుగడ్డి దగ్ధం

● సుమారు రూ.2.50 లక్షల మేర నష్టం



మృతిచెందిన ఆవు, దగ్ధమవుతున్న ఎండుగడ్డి

తూప్రాన్, ఫిబ్రవరి 17: తూప్రాన్ పట్టణ పరిధిలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒక ఆవు మృతిచెందగా.. పది పశువులకు గాయాలయ్యాయి. ఎండుగడ్డి మోపులు కాలిబూడిదయ్యాయి. పట్టణానికి చెందిన పుల్ల మల్లేశ్‌యాదవ్ పట్టణ పరిధిలో తెట్టెకుంట వద్ద వ్యవసాయంతో పాటు పశువుల పెంపకం చేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం భోజనం చేసేందుకు కుటుంబీకులు పొలం వద్ద నుంచి ఇంటికి వచ్చారు. ఆ సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి అక్కడే కట్టేసిన ఆవు మృతిచెందగా.. 10 పశువులకు గాయాలయ్యాయి. అలాగే పశువుల కోసం నిలువ చేసిన రూ.లక్ష విలువైన 1500 ఎండుగడ్డి మోపులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు చెప్పారు. అలాగే మృతిచెందిన ఆవు విలువ రూ.1.50 ఉంటుందన్నారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

## 'ధరణి'తో పట్టా భూమి మాయం

● ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు

● న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



భూమికి సంబంధించిన పత్రాలను చూపిస్తున్న హీరురాథోడ్, జ్ఞానేందర్

జహీరాబాద్, ఫిబ్రవరి 17: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణితో తమ వ్యవసాయ భూమి రికార్డుల్లో నుంచి మాయమైందని బాధితులు హీరురాథోడ్, జ్ఞానేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ సజ్జారావ్‌పేట తండాలోని 139 సర్వేనెంబర్‌లో గల 7 ఎకరాల పైచిలుకు వ్యవసాయ భూమి రికార్డుల్లోంచి మాయమైందన్నారు. తమ తాతలైన రాంచందర్, లక్ష్మణ్ పేరిట ఉన్న వ్యవసాయ భూమి ధరణి వచ్చాక రికార్డుల్లోంచి తొలగించారని పేర్కొన్నారు. అనంతరం కొన్నాళ్లకు అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. అతను కూడా ఇటీవల ఆ భూమిని వేరే వ్యక్తులకు అమ్మేశాడని చెప్పారు. ఈ విషయాన్ని అధికారులకు, పోలీసులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. మొగుడంపల్లి రెవెన్యూ అధికారుల తప్పిదాల వల్లే తమ తాతలకు చెందిన వ్యవసాయ భూమి ఇతర వ్యక్తులకు పట్టా చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని ఇప్పించాలని కోరారు. తమకు అన్యాయం జరిగితే కుటుంబసభ్యులతో కలిసి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు.

## మెదక్ జిల్లాలో కొనసాగుతున్న బదిలీలు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 17: జిల్లాలో బదిలీల పర్వం కొనసాగుతోంది. తాజాగా మెదక్ జిల్లాకు అదనపు ఎస్పీగా మహ్మద్ రెహమాన్ నియమిస్తూ.. డీజీపీ రవిగుప్తా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే రవాణాశాఖలో ఇద్దరు మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ)లు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీఐ కిస్టఫర్ గజ్వేల్ యూనిట్ ఆఫీస్‌కు బదిలీ కాగా.. ఆయన స్థానంలో ఆర్మూర్ నుంచి వెంకటస్వామి వచ్చారు. ఎంవీఐ అఫ్రోజ్ కామారెడ్డి చెక్‌పోస్టుకు, బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మద్నూర్ నుంచి మెదక్‌కు వస్తున్నారు.

## రవాణాశాఖలో..

కంది, ఫిబ్రవరి 17: కంది పరిధిలోని సంగారెడ్డి జిల్లా రవాణా కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ఉప కమిషనర్‌తో పాటు ఇద్దరు ఎంవీఐలు, ఇద్దరు ఏఎంవీఐలు బదిలీ అయ్యారు. ఇన్నిరోజులు ఉమ్మడి జిల్లా ఉప కమిషనర్‌గా కొనసాగిన శివలింగయ్య మహబూబ్‌నగర్‌కు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నిజామాబాద్ నుంచి వెంకటరమణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే సంగారెడ్డి పరిధిలో ఎంవీఐలుగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి, కృష్ణవేణి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఏఎంవీఐలు ఆదిత్య కోదాడకు, ప్రవీణ్‌కుమార్ నారాయణపేటకు బదిలీ అయ్యారని కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీకాంత్ తెలిపారు.

## మంత్రి చొరవతో తీరిన నర్సుల కొరత

జోగిపేట/వట్‌పల్లి, ఫిబ్రవరి 17: ఇటీవల రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోగిపేట ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేయగా స్టాఫ్ నర్సుల కొరత తీవ్రంగా ఉన్నట్లు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి దామోదర్ 12స్టాఫ్‌నర్స్ పోస్టులను జోగిపేటకు మంజూరు చేయించారు. 12మందిలో 10మంది స్టాఫ్ నర్సులు బదిలీపై జోగిపేటకు వచ్చి, శనివారం జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సంగారెడ్డి సమక్షంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సంగారెడ్డి మంత్రి దామోదర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైనది

శివ్వంపేట, ఫిబ్రవరి 17: ఉపాధ్యాయ వృత్తి బాధ్యతాయుతమైనదని జిల్లా విద్యాధికారి రాధకిషన్ పేర్కొన్నారు. టీచర్లు అంకితభావంతో పనిచేయాలని కోరారు. శనివారం దొంతి ఉన్నత పాఠశాల హెచ్ఎం కృష్ణ, ఉపాధ్యాయులు మనీష్, మల్లేశ్, గీత బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, మాలతి, శారద పాల్గొన్నారు. స్వయం పాలనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు డీఈవో బహుమతులను అందజేశారు.



దొంతిలో మాట్లాడుతున్న డీఈవో రాధాకిషన్

# 'డబుల్' ఇళ్ల పంపిణీ ఇంకెప్పుడు?

- నర్సాపూర్‌కు 500ఇళ్ల మంజూరు
- 252 ఇళ్ల నిర్మాణం పూర్తి
- ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదలు

నర్సాపూర్, ఫిబ్రవరి 17: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2016లో నర్సాపూర్ పట్టణంలో చేపట్టిన 500 డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణంలో పూర్తయిన వాటిని ఇప్పటికీ పేదలకు పంపిణీ చేయలేదు. నిర్మాణం పూర్తయిన దాదాపు 250 ఇళ్లను గత ఎన్నికలకు ముందు పంపిణీ చేయాలని భావించారు. అర్హులు అధిక సంఖ్యలో ఉండడంతో పంపిణీ చేస్తే ఎన్నికలపై ప్రభావం చూపుతుందన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేయలేదన్న విమర్శలు వచ్చాయి. ఇప్పుడు అధికారంలోకి కాంగ్రెస్ రావడంతో ఇళ్లను పంపిణీ చేస్తారనే ఆశతో దరఖాస్తుదారులు ఎదురుచూస్తున్నారు.



నర్సాపూర్ పట్టణంలో నిర్మాణం పూర్తయి పంపిణీకి సిద్ధంగా ఉన్న 252 ఇళ్లు

**ఇళ్ల పంపిణీకి కృషి చేస్తా..**



నర్సాపూర్ పట్టణంలో పూర్తయిన 250ఇళ్లను పేదలకు పంపిణీ చేయడానికి తనవంతు కృషి చేస్తాను. డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయాన్ని ప్రభుత్వంతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. అర్హులైన పేదలకు ఇళ్లను పంపిణీ చేసేలా చూస్తాను.

- సునీతారెడ్డి, ఎమ్మెల్యే

### మూడువేల దరఖాస్తులు

నర్సాపూర్‌లో చేపట్టిన 500 ఇళ్లకు మూడువేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. బీఆర్ఎస్ రెండుసార్లు అధికారంలోకి వచ్చి కూడా ఇళ్లను పంపిణీ చేయకపోవడంతో దరఖాస్తుదారుల్లో నైరాశ్యం నెలకొంది. ఎన్నోసారు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇళ్లను సందర్శించి, త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పడం తప్ప అమలు చేయలేదు.

### పరిగణలోకి పాత దరఖాస్తులేనా?

బీఆర్ఎస్ హయాంలో మూడువేలకు పైగా దరఖాస్తులు రాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పరిగణలోకి తీసుకుంటుందో లేదోనన్న సందేహం ఆశావహుల్లో నెలకొన్నది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఇంకా స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడంతో ఆశావహులు గందరగోళంలో పడ్డారు.

## వయసు పైబడిన వారికి మినహాయింపు ఇవ్వండి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత రెడ్డి



మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వత రెడ్డి

నారాయణఖేడ్, ఫిబ్రవరి 7: పార్లమెంట్ ఎన్నికల్లో వయసు పైబడిన ఉపాధ్యాయులకు విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పర్వతరెడ్డి కోరారు. శనివారం ఖేడ్‌లో నిర్వహించిన యూనియన్ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరతను నివారించేందుకు టీఆర్టీని నిర్వహించాలన్నారు. జీవో 317 ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, పెండింగ్ బిల్లులను క్లియర్‌చేయాలని, పీఆర్సీ కమిటీ రిపోర్టు త్వరగా తెప్పించి అమలు పరచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ సాబేర్‌అలీ, శ్రీనివాస్ రాథోడ్, రమణకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్‌కుమార్, హఫీజ్, జీవన్‌రాథోడ్, శివశంకర్ రాథోడ్, రాజ్‌కుమార్, జ్ఞానేశ్వర్, దేవీసింగ్, విజయ్‌కుమార్,ప్రతాపరెడ్డి, షకీల్ అహ్మద్, సుందర్‌రావు, విజయ్‌కుమార్, ప్రకాష్, లక్ష్మయ్య, పాల్గొన్నారు.

## పనుల్లో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదు



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో జ్యోతి

కంది, ఫిబ్రవరి 17 : ఉపాధిహామీ పనుల్లో జాప్యం చేస్తే ఉపేక్షించేది లేదని డీఆర్‌డీవో జ్యోతి అన్నారు. కంది ఎంపీడీవో కార్యాలయాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను, నర్సరీని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీలో చాలా వరకు మొక్కలు లేవని, కొన్ని ఎండిపోయాయని ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కంది మండలంలో ఎన్ఆర్‌జీఎస్ పనులు అనుకున్నంత మేర జరగడంలేదని తెలిపారు. ప్రతీ గ్రామంలో ఉపాధిహామీ పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఏపీవో గురుపాదానికి సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది తదితరులున్నారు

## 'లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలి'

జహీరాబాద్, ఫిబ్రవరి 17: లోక్ అదాలత్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ సూరిక్రిష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ మార్చి 9న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ నాయకులు కుప్పానగర్ మాణెన్న, సంతోష్‌సాగర్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

హత్నూర, ఫిబ్రవరి 17: హత్నూర మండలంలోని ఆయా అభివృద్ధి పనులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దరఖాస్తు చేసిన నిధులు మంజూరు అయినట్టు ఎంపీపీ నర్సింలు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం దౌల్తాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో 38 గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 2 కోట్లు, 26 గ్రామ పంచాయతీలలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు రూ.1కోటి 76లక్షలు, 26 గ్రామ పంచాయతీలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు 77లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిషన్‌రావు, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నరేందర్, యువత అధ్యక్షుడు కిషోర్, నాయకులు బుచ్చిరెడ్డి, రామచంద్రారెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

## రూ. 2కోట్ల 50లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ పనులు



మాదారంలో ఎన్ఆర్ఈజీఎస్ పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితరులు

జిన్నారం, ఫిబ్రవరి 17: జిన్నారం మండలంలోని వివిధ గ్రామాల్లో 2కోట్ల 50లక్షలతో చేపట్టనున్న ఎన్ఆర్ఈజీఎస్ అభివృద్ధి పనులకు జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. మండలంలోని 15గ్రామ పంచాయతీలు, వాటి పరిధిలోని గ్రామాల్లో సీసీ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని జడ్పీటీసీ, ఎంపీపీలు అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు లావణ్య నరేష్, జానాభాయి, ఎంపీడీవో అరుణారెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వడ్డె కృష్ణ, సత్యనారాయణ, రాజుగౌడ్, సురేందర్‌గౌడ్, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



లక్ష్మి (ఫైల్)

జహీరాబాద్, ఫిబ్రవరి 17: వంట చేస్తుండగా మంటలు అంటుకొని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన జహీరాబాద్ పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్‌బీహెచ్ కాలనీలో బసంత్‌రెడ్డి, లక్ష్మి(60) దంపతులు నివాసముంటున్నారు. వారు ఈనెల 14న స్టవ్‌ను వెలిగిస్తుండగా మంటలు ఎగిసిపడి, భార్యాభర్తలిద్దరూ గాయాలపాలయ్యారు. వారిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం వృద్ధురాలు మృతిచెందింది. వృద్ధురాలి కుమారుడు వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## వెంకటాయపల్లిలో రెండిళ్లలో చోరీ

- మరో ఇంట్లో చోరీకి యత్నం

తూప్రాన్, ఫిబ్రవరి 17: తూప్రాన్ మండలం వెంకటాయపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి రెండిళ్లలో చోరీ జరగగా, మరో ఇంట్లో చోరీకి ప్రయత్నించారు. గ్రామస్థులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాయపల్లి గ్రామానికి చెందిన చిన్నలంబ మహేశ్.. సోదరుడి ఇంట్లో సత్యనారాయణస్వామి వ్రతం జరగడంతో తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న తులంన్నర బంగారు అభరణాలు, 30తులాల వెండి ఆభరణాలు, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. చీమలదారి సత్యనారాయణగౌడ్ కొన్ని రోజులుగా మనోహరాబాద్‌లో ఉంటున్నాడు. మహిళా సంఘంలో డబ్బులు చెల్లించేందుకు రాగా, సంఘ సభ్యులు లేకపోవడంతో ఇంట్లోనే పెట్టి మనోహరాబాద్ వెళ్లాడు. రాత్రి దుండగులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో దాచిన రూ.5వేల నగదు ఎత్తుకెళ్లారు. కిష్టారం పెంటయ్య కొత్తగా ఇల్లు నిర్మించుకోవడంతో పాత ఇంటికి తాళం వేసి ఉంచగా, తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ చేసేందుకు యత్నించారు. ఇంట్లో ఏమీ లేకపోవడంతో చోరీ జరగలేదని గ్రామస్తులు తెలిపారు.

## 'యాదగిరిగుట్టకు బస్సును పునఃప్రారంభించాలి'

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 17: మెదక్ నుంచి యాదగిరిగుట్టకు బస్సును పునఃప్రారంభించాలని బీజేపీ మండలాధ్యక్షుడు రాజు ఆర్టీసీ అధికారులను డిమాండ్ చేశారు. శనివారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గతంలో మెదక్ నుంచి చిన్నశంకరంపేట మీదుగా ఆర్టీసీ బస్సు యాదగిరి గుట్టకు వెళ్లేదన్నారు. బస్సును బందు చేయడంతో యాత్రికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు యాదగికిగుట్టకు బస్సును పునఃప్రారంభిచాలని కోరారు. కార్యక్రమంలో ఆకుల రాజు, శ్రీను, నర్సింహులు, అశోక్, నరేష్ పాల్గొన్నారు.

### సమయ పాలన పాటించని ఈజీఎస్ సిబ్బంది

శివ్వంపేట: శివ్వంపేట ఈజీఎస్ సిబ్బంది సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. శనివారం కూడా కార్యాలయానికి ఉదయం 11 దాటినా ఆపరేటర్ తప్పా మిగిలిన సిబ్బంది ఎవరూ రాలేదు. ఈ విషయమై ఏపీవో అనిల్‌ను సంప్రదించగా సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లినట్లు చెప్పారు.

### అల్లాపూర్ విద్యార్థుల ప్రతిభ

తూప్రాన్: తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు మండల స్థాయి టాలెంట్ టెస్టులో ప్రతిభను చూపారు. సాంఘికశాస్త్రం పరీక్షలో మేఘన ప్రథమ స్థానం, భార్గవి తృతీయ స్థానం సాధించారు. విద్యార్థులను మాజీ ఉపసర్పంచు కుమ్మరి బాలకృష్ణ అభినందించి, సన్మానించారు.

### విద్యార్థుల కోసం వాటర్ ట్యాంకు నిర్మాణం

నారాయణఖేడ్: మండలంలోని హన్మంత్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం స్కూల్ ఆవరణలో స్టీట్ కాస్‌లో భాగంగా హైదరాబాద్‌లోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎంజీవో సంస్థ ఆధ్వర్యంలో రూ.లక్షతో రెండు వాటర్‌ట్యాంకులను నిర్మించారు. సంస్థ ప్రతినిధులు శనివారం వాటిని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సాకేత్‌మల్లేల, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సౌమ్య, కోశాధికారి ఉషా, హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'కులగణన'పై హర్షం

మెదక్, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో కులగణన నిర్వహణను అసెంబ్లీలో ఆమోదించడం హర్షనీయమని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొండన్ సావిత్రిసురేందర్‌గౌడ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులతో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాహుల్ జోడో యాత్రలో ప్రకటించిన విధంగా ప్రభుత్వం తీర్మానించిదన్నారు. ఇది బీసీలకు రాజకీయంగా ఎంతో ఉపయోగకంగా ఉండబోతోందని పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు ముప్తపురం లింగం, అవారి శేఖర్, నాయకులు బొజ్జ పవన్, మంగ మోహన్‌గౌడ్, మ్యాకల రవి, గాడి అశోక్, సంతోష్, లింగం. కిష్టయ్య, మున్నా, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

### సేవలకు దక్కిన అవార్డులు

సంగారెడ్డి రూరల్: ఐఎన్టీయూసీ నాయకుల సేవలకు అవార్డులు దక్కాయి. ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సన్మానసభలో అవార్డులు అందజేశారు. సంగారెడ్డి జిల్లాకు మూడు అవార్డులు అందాయి. అవార్డులు అందుకున్న వారిలో జిల్లా అధ్యక్షుడు ఈశ్వరప్ప, ఉపాధ్యక్షుడు వీరయ్య కోశాధికారి వెంకటేశం ఉన్నారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### శిక్షణతోనే మరిన్ని ఉపాధి అవకాశాలు

జహీరాబాద్: విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించాలంటే నైపుణ్య శిక్షణ అవసరమని ఆచార్యా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హరికుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఆచార్యకళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ రంగంలో ఉపాధి అవకాశాలు లభించాలంటే నైపుణ్య శిక్షణ పొంది ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ అంశాల్లో నైపుణ్య శిక్షణను తప్పకుండా తీసుకోవాలని సూచించారు.

## సంగారెడ్డి డీఆర్వోగా పద్మజ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న పద్మజ

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 17: సంగారెడ్డి డీఆర్వోగా పద్మజ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల జిల్లా అధికారులను సమన్వయపరుస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

## రోడ్డును ధ్వంసం చేసినా పట్టించుకోరా?



హనుమాన్ నగర్‌లో రోడ్డును తవ్వి, కుప్పగా పోసిన దృశ్యం

సదాశివపేట, ఫిబ్రవరి 17: సదాశివపేట పట్టణం 8వ వార్డు పరిధిలోని హనుమాన్ మందిరం ముందు రూ.2.40లక్షలతో ఎనిమిది నెలల క్రితం మున్సిపల్ అధికారులు సీసీరోడ్డును నిర్మించారు. సీసీరోడ్డు నిర్మించిన స్థలం తమదంటూ కొందరు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ల సహాయంతో వారం రోజుల క్రితం రోడ్డును ధ్వంసం చేశారు. ప్రైవేటు వ్యక్తులు రోడ్డును తవ్వినా బల్దియా అధికారులు, పాలకులు, ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా నిబంధన ప్రకారం రోడ్డును వేసినట్లు ఇంజనీర్ ఏ.రాజేష్‌కుమార్ తెలిపారు. విచారణ జరిపి, రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## హద్నూర్ సీఐగా నవీన్‌కుమార్



న్యాల్‌కల్, ఫిబ్రవరి 17: జహీరాబాద్ రూరల్(హద్నూర్) సీఐగా నవీన్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సీఐల బదిలీల్లో సదాశివపేట సీఐగా కొనసాగిన నవీన్‌కుమార్‌ను హద్నూర్‌కు బదిలీచేశారు. ఈ మేరకు ఆయన సర్కిల్ కార్యాలయంలో బాధ్యతులు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటివరకు హద్నూర్ సీఐగా కొనసాగిన వెంకటేష్ హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

**సమ్మక్క సారలమ్మల ప్రసాదం కోసం**

## ఆర్టీసీ డిపోలో బుకింగ్ కౌంటర్

జహీరాబాద్, ఫిబ్రవరి 17: మేడారం జాతరకు వెళ్లలేని వారి సౌకర్యార్థం సమ్మక్క, సారలమ్మల ప్రసాదం కోసం ఆర్టీసీ డిపోలో బుకింగ్‌కౌంటర్‌ను ఏర్పాటు చేశామని జహీరాబాద్ డిపో మేనేజర్ సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రసాదం కావాలనుకునే వారు డిపోలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్ కౌంటర్ వద్ద బుక్‌చేసుకోవాలన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9154298657 నంబరులో సంప్రదించాలని సూచించారు. ప్రసాదం బుకింగ్‌కోసం రూ.299 చెల్లించాలని, ఈ అవకాశం ఈ నెల 25వరకు మాత్రమే ఉంటుందని ఆయన తెలిపారు.

## ఖేడ్‌లో శివ మహాపడి పూజ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 17: ఖేడ్‌లోని చారిత్రక కాశీనాథ్ ఆలయంలో శివదీక్షధారుల ఆధ్వర్యంలో శనివారం మహాపడిపూజ, గణపతిపూజ, మహాహారతి, ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రాణప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి గురురాజ్ శర్మ, బోలాశంకరుడి మహిమలు, విశిష్టతలను గురించి భక్తులకు వివరించారు. అనంతరం అన్నప్రసాదం చేశారు. ఖేడ్ ప్రాంత శివదీక్షారులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శివనామ స్మరణతో హోరెత్తించారు.

# పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17: పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, రూట్ ఆఫీసర్స్, కస్టోడియన్స్‌కు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వరకు జరిగే పదవ తరగతి పరీక్షలకు సమాయత్తం కావాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లను అనుమతించవద్దని స్పష్టం చేశారు. అనంతరం ప్రశ్నాపత్రం, జవాబు పత్రాలపై నమోదు చేయాల్సిన వివరాలను డీఈవో వివరించారు. ఈ సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ మణిదీప, ఎంఈవోలు, సీఎస్, డీవోలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి

- సంగారెడ్డి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ లావణ్య
- ఏడుగురు సభ్యులకు ముగ్గురే హాజరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 17: సంగారెడ్డి మండల సర్వసభ్య సమావేశం శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో మండలంలోని ఎంపీటీసీలకు, మండల అధికారులకు సమాచారం అందించారు. వివిధ శాఖల మండల అధికారులు హాజరుకాగా.. మండలంలో ఉన్న మొత్తం ఏడుగురు ఎంపీటీసీలకు ముగ్గురు మాత్రమే హాజరుకావడం గమనార్హం. ఈ సందర్భంగా ఎంపీపీ లావణ్యాదుర్గేష్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, మండలాభివృద్ధికి జరిగేలా చూడాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో యాదగిరి మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నందున ప్రజాప్రతినిధులు సహకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# అగ్నిప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జహీరాబాద్, ఫిబ్రవరి 17: అగ్నిప్రమాదాల నివారణపై శనివారం హోతి(కే) గ్రామశివారులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అగ్నిమాపక శాఖ అధికారి ప్రశాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు ఇంట్లోని గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు ఎగిసిపడితే ఎలా అదుపు చేయాలో సూచించారు. అత్యవసర సమయాల్లో అగ్నిప్రమాదాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, యూనూస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి పనులను ముమ్మరంగా జరిపించాలి

- మెదక్ జడ్పీ సీఈఓ ఎల్లయ్య



అల్లాదుర్గం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎల్లయ్య

రేగోడు/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట ఫిబ్రవరి 17: ఉపాధి పనులను ముమ్మరంగా జరిపించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. శనివారం రేగోడు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించి, ఉపాధి, మండల పరిషత్ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లోనే కూలీలకు ఉపాధి కల్పించే విధంగా పనులను పెంచాలని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ సీఈవో, ఉపాధి ఏపీడీ రామాంజనేయులు, ఏపీవో జగన్మోహన్, ఈసీ జగదీశ్వర్, టీఏలు అశోక్, లక్ష్మణ్, ఆమోస్ మండల పరిషత్ సిబ్బంది శ్రీనివాస్, కేశయ్య, రమేష్ ఉన్నారు. అల్లాదుర్గం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులపై స్థానిక ఎంపీడీవో శంకర్, ఏపీవో సుధాకర్‌ను అడిగి వివరాలు తెలసుకున్నారు. రైతు కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఉప కార్యనిర్వహణ అధికారి రంగాచారి ఉన్నారు. అలాగే పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయనవెంట డిప్యూటీ సీఈవో రంగాచారి, ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీవో విఠల్‌రెడ్డి ఉన్నారు.

# బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 17: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలను శనివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్‌చేసి సంబురాలు చేశారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో పండ్లను పంచిపెట్టారు. ప్రత్యేక తెలంగాణ సాధనకు, ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందజేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.



సంగారెడ్డిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



పాపన్నపేట మండలం ఏడుపాయలలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి



కూచారంలో కేక్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

## కబ్జాలో ఉన్న ప్రభుత్వ స్థలం స్వాధీనం



ఎర్దనూర్‌లో ప్రభుత్వ స్థలంలో పాతిన కడీలను తొలగిస్తున్న అధికారులు

కంది, ఫిబ్రవరి 17: కంది మండల పరిధిలోని ఎర్ధనూర్ గ్రామ శివారు సర్వేనంబరులో 338లో 5.16ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఈ భూమిని 2009లో అధికారులు పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించారు. అయితే ఇందులో రెండకరాల భూమిని కొందరు కబ్జా చేశారు. ఆ స్థలం చుట్టూ కంచె వేసి కడీలు పాతారు. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఆర్ఐ రంగయ్య, సర్వేయర్ సంగీత శనివారం అక్కడకు వెళ్లారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కడీలును తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.